సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 14 । మార్చి । 2023



పంటభద్రుడు..!
పుడమితల్లిని నమ్ముకున్న దూబ రమేష్‌బాబు నాలుగేళ్లుగా వాణిజ్య పంటలు సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.
- 8లో



నియోజకవర్గంలో నవ కేంద్రాలు
చీపురుపల్లి నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు.
- 8లో



ఫిజియోథెరపీతో ఉపశమనం
నడుము, కీళ్లు, మెడ నొప్పి, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఫిజియోథెరపీ వైద్యం ఉపశమనం కలిగిస్తోంది.
- 8లో

న్యూస్‌రీల్

నేడు శంబర పోలమాంబ ఎనిమిదో జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఎనిమిదవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. చదురుగుడి, వనంగుడి కూల్బైన్ల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. లడ్డూ ప్రసాదం సిద్ధం చేశారు. భక్తులకు ఎండ తగలకుండా క్యూకాంప్లెక్స్‌ల వద్ద పెండల్స్ ఏర్పాటు చేశారు. సాలూరు సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ జి.ఫైడిరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి పట్టణాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.

పులిదాడిలో గేదె మృతి

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు



పులిదాడిలో చనిపోయిన గేదెను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గంట్యాడ: మండలంలోని మదనాపురం (మరడాం) గ్రామంలో వర్రి శ్రీనుకు చెందిన గేదెపై సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పులి పంజా విసిరింది. కళ్లానికి 500 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లి హతమార్చింది. సర్పంచ్ జాగరపు అప్పారావు సమాచారం మేరకు అటవీశాఖ బీట్ ఆఫీసర్లు వి.రామారావు, ఎస్.రవికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులిదాడిచేసినట్టు నిర్ధారించారు. పాడి గేదెను కోల్పోయిన రైతుకు పరిహారం అందజేస్తామని చెప్పారు. పులిని పట్టుకునేందుకు బొండపల్లి మండలం మూలపాడు వద్ద బోను ఏర్పాటు చేశామన్నారు.

సీతంపేట ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి



ఆస్పత్రిలో రక్తపరీక్షల కేంద్రం వద్ద గుమిగూడిన రోగులు

సీతంపేట: సీతంపేట ఏరియా ఆస్పత్రికి వైరల్ జ్వరపీడితుల తాకిడి పెరిగింది. ప్రతిరోజు జ్వరాలతో బాధపడుతున్న వారు అధికమంది ఆస్పత్రికి వచ్చి ఉచిత వైద్యసేవలు పొందుతున్నారు. ఎండ తీవ్రత పెరగడంతో వైరల్ జ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.


నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ: చిన్నారుల్లో నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు తెలిపారు. పట్టణంలోని పలు పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం పరిశీలించారు.

జిల్లాకు చేరిన 104 వాహనాలు



వైద్య ఆరోగ్యశాఖ ఆవరణలో ఉన్న 104 వాహనాలు

విజయనగరం ఫోర్ట్: జిల్లాకు కొత్తగా ప్రభుత్వం సమకూర్చిన 104 వాహనాలు చేరుకున్నాయి. మొత్తం 19 వాహనాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో ఉంచారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ పీహెచ్‌సీకి ఒక వాహనాన్ని కేటాయించింది. జిల్లాలో 104 వాహనాలు ప్రస్తుతం 27 ఉన్నాయి. కొత్తగా 19 వాహనాలు రావడంతో వీటి సంఖ్య 46కు చేరింది. రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రజలకు ప్రయోజనకరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చింది.

ఓటెత్తారు

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రశాంతంగా ఓటింగ్
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక ఘట్టం ముగింపు
- ఉత్తరాంధ్రలో అత్యధికంగా విజయనగరంలోనే ఓటింగ్
- జిల్లా మొత్తంమీద 74.98 శాతం నమోదు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 73.54 శాతం ఓటింగ్
- ఉదయం 8 గంటల నుంచే బారులు తీరిన ఓటర్లు
- ఎక్కడా ఇబ్బందుల్లేకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు
- కంట్రోల్ రూమ్‌ల నుంచి ఇరు జిల్లాల కలెక్టర్లు సూర్యకుమారి, నిషాంత్‌కుమార్ పర్యవేక్షణ
- పోలీసు రక్షణలో బ్యాలెట్ బాక్సులు విశాఖకు తరలింపు
- 16వ తేదీన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు



పార్వతీపురం డీవీఎం పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టిన ఓటర్లు



వీల్ చైర్‌లో మహిళా ఓటర్‌ను తీసుకెళ్తున్న సిబ్బంది

పార్వతీపురం మన్యం జిల్లాలో పోలింగ్ ఇలా... (శాతం)	ఉదయం 10 గంటలకు	ఉ.11కు	మధ్యాహ్నం 12 గంటలకు	మ. ఒంటిగంటకు	మ. 2కు	మ. 3కు	సాయంత్రం 4 గంటలకు
	9.94	14.36	23.67	34.85	43.96	53.21	73.54

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో కీలకమైన ఓటింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం వేడిమికి కాస్త ఖాళీగా కనిపించినా 3 గంటల తర్వాత భారీ సంఖ్యలో క్యూకట్టారు. గడువు సమయం 4 గంటల్లోగా పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని అధికారులు ఇచ్చారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఇందుకు పక్కాగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఉత్తరాంధ్రలోనే అత్యధికంగా విజయనగరం జిల్లాలో 74.98 శాతం, తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాలో 73.54 శాతం పోలింగ్ నమోదైంది. క్రితంసారి ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 70.49 శాతమే పోలింగ్ అయ్యింది.

16న విశాఖలో కౌంటింగ్...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తొలిసారిగా బరిలోకి దిగింది. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ-విజయనగరం-శ్రీకాకుళం జిల్లాల) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ పోటీచేశారు. ఇదే నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ బీజేపీ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగారు. మాధవ్ కన్నా ముందు ఇదే నియోజకవర్గంలో రెండుసార్లు ప్రాతినిథ్యం వహించిన పీడీఎఫ్ తరఫున డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పోటీచేశారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో ఉన్న టీడీపీ ఈసారి వేపాడ చిరంజీవిరావును పోటీ చేయించింది. ఇప్పటికీ తమ పార్టీ పరిస్థితి ఏమాత్రం మెరుగుపడలేదని గ్రహించిన చంద్రబాబు రెండో ప్రాధాన్యత ఓటు కోసం పీడీఎఫ్‌తో మంత్రాంగం చేసైనా గట్టెక్కాలని ప్రయత్నాలు చేశారు. ఈ నలుగురితో పాటు మరో 33 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్న ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విజేతలెవరో ఈనెల 16వ తేదీన తేలనుంది. సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి తరలిస్తున్నారు. అక్కడే కౌంటింగ్ జరగనుంది.

నిరంతర పర్యవేక్షణ...

ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికార యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం 8 గంటలకే పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ మొదలైంది. తొలిగంటలో నెమ్మదిగా జరిగినప్పటికీ తర్వాత వేగం పుంజుకుంది. మధ్యాహ్నం కాస్త మందగించినా సాయంత్రం 3 గంటల తర్వాత ఓటర్లు బారులు భారీ సంఖ్యలో బారులు తీరారు. ఇరు జిల్లాల కలెక్టర్లు ఎ.సూర్యకుమారి, నిషాంత్‌కుమార్ ఎన్నికల ప్రక్రియను కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూము నుంచి పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితిని గమనించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించారు. వారు కూడా కొన్ని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. ఇరు జిల్లాల ఎస్పీలు దీపికా పాటిల్, విద్యాసాగర్ నాయుడు పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. వైద్యారోగ్యశాఖ సిబ్బందితో ప్రథమచికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసి వివిధ రకాల మందులను అందుబాటులో ఉంచారు. ఓటరు స్లిప్పులను తీసుకురా





పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

నివారి కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది ఓటరు స్లిప్పులను అందజేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్దా వీడియో రికార్డింగ్ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడకుండా, వంద మీటర్ల దూరంలోనే బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

ఓటేసిన ప్రముఖులు

ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సాలూరులోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ ఝాన్సీ దంపతులు విజయనగరంలోని కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

స్వయంగా పరిశీలన...

వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఆయా ప్రాంతాల్లోని నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల నియోజకవర్గంలో పోలింగ్ సరళిని, శృంగవరపు కోట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మొత్తం ఓటర్ల సంఖ్య:	18,520
పురుషులు:	12,516
మహిళలు:	6,002
ఇతరులు:	2

ఓటు హక్కు వినియోగించుకున్నవారి సంఖ్య:	13,619
పురుషులు:	9,002
మహిళలు:	4,617




పోలింగ్ కేంద్రం వద్ద నిర్వహించిన మెడికల్ క్యాంపు




కలెక్టరేట్‌కు బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది

మన్యంలో ప్రశాంతం..

పార్వతీపురం టౌన్/ పార్వతీపురం: జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలతో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీఓ కె.హేమలత పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో ఏఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బీ సీఐ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు బలిజిపేటలో, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జియ్యమ్మవలస మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆర్డీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే జోగారావు దంపతులు



ఓటు వేసిన ఆనందంలో పాలకొండ ఎమ్మెల్యే కళావతి, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

వైఎస్సార్‌సీపీ జైత్రయాత్ర కొనసాగుతుంది

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జైత్రయాత్ర కొనసాగుతుందని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సాలూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలోదిగిన సీతంరాజు సుధాకర్ గెలుపుతథ్యమని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ, అభివృద్ధి పాలనతో ప్రజలకు మంచిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికు పట్టభద్రుల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయన్నారు. మంచిపనులు చేసేవారినే ప్రజలు నమ్ముతారని, అందుకే జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమయ్యేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీద పారిశ్రామిక వేత్తలకు ఉన్న నమ్మకమే ప్రధాన కారణమన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలుచేస్తూ, అవినీతిరహితంగా సంక్షేమ, అభివృద్ధి పాలనసాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డితో నేరుగా పోటీచేయలేక టీడీపీ నాయకులు వామపక్ష పార్టీల కాళ్లు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సింహం ఎప్పుడు సింగిల్‌గానే వస్తుందని, ఏ ఎన్నికలో అయినా వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని పునరుద్ఘాటించారు.



ఓటు హక్కును వినియోగించుకున్నట్టు వేలిని చూపిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

తపనతోనే రాణింపు



సావినార్‌ను ఆవిష్కరిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు

విజయనగరం అర్బన్: తపన, ఆలోచనా దృక్పథం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని, మారుతున్న కాలానికి అనుగుణంగా యువత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గురుగుబెల్లి స్వామినాయుడు పిలుపునిచ్చారు. వర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎక్లేటిక్యూ-2కే23' పేరుతో రెండు రోజులపాటు జరగనున్న నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం సోమవారం ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ రిజిస్ట్రార్ మాట్లాడుతూ సమాజానికి, దేశానికి సేవ చేయడమే విద్య పరమార్థమన్నారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనిస్తూ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకునే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ జాన్‌బిటీ మాట్లాడుతూ ట్రిపుల్ ఈ విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమని తెలిపారు. ఈ సింపోజియం ద్వారా విజ్ఞానం మరింత మెరుగుపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్తవిషయాలు తెలుసుకునేందుకు టెక్నికల్ సింపోజియంనకు హాజరుకావాలని కోరారు. నూతన ఆవిష్కరణలకు సాంకేతిక సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం సదస్సు సావినార్‌ను ఆవిష్కరించారు. ట్రిపుల్‌ఈ విభాగం అధిపతి డాక్టర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ప్రొఫెసర్ కె.బాబులు, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డాక్టర్ సి.నీలిమాదేవి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధితి డాక్టర్ బి.నళిని, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, వివిధ ఇంజినీరింగ్ కళాశాల నుంచి వచ్చిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ



కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ మెయిన్ రోడ్డులో శాలివాహన వర్గీయులు ఏర్పాటు చేసిన కవయిత్రి ఆతుకూరి మొల్ల విగ్రహాన్ని ఆమె జయంతి సందర్భంగా పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మొల్లమాంబ విగ్రహాన్ని ముందుగా మన మున్సిపాలిటీలో ఏర్పాటు చేయడంగర్వంగా ఉందన్నారు. ఆతుకూరి మొల్ల తెలుగులో రామాయణం రచించిన తొలితెలుగు మహిళా కవయిత్రిగా పేరు పొందిందన్నారు. ఆమె రచనా శైలి సరళమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రవికుమార్, ఎస్.లక్ష్మణరావు, రాము, కె.కాళీ, గౌరీ శంకరరావు, శాలివాహన సభ్యులు పాల్గొన్నారు.

97.86 శాతం ఈ-క్రాప్ నమోదు

పార్వతీపురం: జిల్లాలో 2022-23 రబీ సీజన్ లో 46,532 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ సోమవారం తెలిపారు. ఈ క్రాప్ నమోదుకు మొదట ఫిబ్రవరి 10 తేదీ గడువుగా నిర్ణయించారు. క్రమేపీ ఆ గడువును మార్చి 4వ తేదీ వరకు పొడిగించారు. ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ఈనెల 17 వరకు ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తామని, గ్రామ సభలను నిర్వహించి అర్హుల జాబితాను తెలియజేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

ఆవుదూడ సజీవదహనం



సజీవ దహనమైన ఆవుదూడ

సీతానగరం: మండలంలోని పెదంకలాం గ్రామంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు పశువుల శాలలు దగ్ధం కాగా ప్రమాదంలో ఆవుదూడ సజీవదహనమైంది. ఈ సంఘటనపై వీఆర్వో జి.బాబూరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాన్న అప్పలనాయుడు, బలగ గౌరమ్మలకు చెందిన పశువుల శాలలు దగ్ధమయ్యాయి. గ్రామంలోని ప్రజలు అగ్ని మంటలను ఆర్పివేశారు. అయితే తాన్న అప్పలనాయుడుకు చెందిన ఆవుదూడ మంటల్లో చిక్కుకుని మృతిచెందింది. అలాగే గ్రామంలోని ఎస్‌కోట వీధిలో జి.తవిటినాయుడు, జి.చినప్పల నాయుడుల పశువుల శాలలు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల సమాచారంమేరకు బొబ్బిలి నుంచి అగ్ని మాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది.

సారా స్థావరాలపై దాడులు

- 18వేల లీటర్ల బెల్లం ఊట, 220లీటర్ల సారా ధ్వంసం



సారా నిల్వలను పట్టుకున్న ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వి.విద్యాసాగర్ నాయుడు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ సిబ్బంది, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా ఆంధ్ర ఒడిశా సరిహద్దు సమీపంలో ఆంధ్రప్రాంత గ్రామాలకు సారా రవాణా చేసే ఒడిశా గ్రామాలైన హాటిగడ, రేవటిగుడ సమీపంలో కొండ ప్రాంతంలో సారా స్థావరాలపై సోమవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 18,000 లీటర్ల బెల్లం ఊటలు, 220 లీటర్ల సారా ధ్వంసం చేశారు. దాడుల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, సతీష్, ఎస్సైలు జె.రాజశేఖర్, శేఖరం, రమణ, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఒడిశా ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మక్కువ: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు కళాశాల స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు. మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 14 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతుయని పేర్కొన్నారు.


పెదపోలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



పెదపోలమ్మ ఘటాలకు పూజ చేసి, స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో జరుగుతున్న పెదపోలమ్మ సంబరాలకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆరోజు జరిగే పండగకు హాజరు కాలేకపోతున్నానని, అందుకే ఇప్పుడు వచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దాడితల్లి సేవలో ఎమ్మెల్యే



బొబ్బిలి: దాడితల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు గొల్లపల్లి దాడితల్లి అమ్మవారిని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం దర్శించుకున్నారు. మే 1, 2, 3వ తేదీల్లో జరగనున్న పండగ నేపథ్యంలో ఆయన అమ్మవారికి ముందస్తుగా పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు తెలిపారు.

పంటభద్రుడు..!

- బీడు భూమిలో వాణిజ్య సేద్యం
- మునగ, జామ, డ్రాగన్ తోటల పెంపకం
- నాలుగేళ్లుగా సాగు
- రెండేళ్ల నుంచి ఫలసాయం



కాగితాపల్లిలో డ్రాగన్ తోట



పూతదశలో డ్రాగన్



తైవాన్‌జామ

పట్టభద్రుడైన ఆ యువకుడు వినూత్న పద్ధతిలో సాగు చేస్తూ అందరి చేతా ఔరా అనిపించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎందుకూ కొరగాని భూములను ఎంచుకుని సస్యశ్యామలం చేసి లాభాలు ఆర్జిస్తుండడంతో పలువురు రైతులు ఆ యువకుడి దారిలో పయనించేందుకు ఉద్యుక్తులవుతున్నారు. విజయనగరం జిల్లా రేగిడి మండలంలోని కాగితాపల్లి గ్రామానికి చెందిన యువరైతు దూబ రమేష్ బాబు బీడు భూముల్లో సాధించిన విజయ గాథ ఇలా ఉంది.

రేగిడి: పుడమితల్లిని నమ్ముకున్న దూబ రమేష్ బాబు నాలుగేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య పంటలు సాగుచేస్తూ పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. చేసిన సాగుకు రెండేళ్లుగా ఆదాయం వస్తోంది. అది చూసి మిగిలిన గ్రామాల రైతులు కూడా ఆ యువరైతు బాటలో సాగేందుకు సిద్ధమవుతున్నారు.

వానిజ్య పంటల సాగుపై దృష్టి

రమేష్‌బాబు సాగుచేస్తున్న పంటపొలాలు సాధారణ వ్యవసాయభూములు కాదు. పూర్తిగా వ్యవసాయానికి పనికిరాని పంటపొలాలుగా వదిలేసినవి. వ్యవసాయంపై ఆసకితో తమకు ఉన్న పంట పొలాల్లో సేద్యానికి పనికిరాకుండా ఉన్న మెట్టు భూమిని సాగులోకి తీసుకొచ్చాడు. సాధారణ సాగు కాకుండా వాణిజ్యరంగంలో వినూత్నంగా డిమాండ్ ఉన్న పంటలపై దృష్టిపెట్టాడు. వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలు, పలు ప్రాంతాల్లో వ్యవసాయం ద్వారా లాభాలు సాధించిన రైతులను సంప్రదించి తొలుత డ్రాగన్, జామ తోటల సాగు ప్రారంభించిన రమేష్‌బాబు అనంతరం మరికొంత ప్రాంతంలో నేరేడు, గ్రీన్‌యాపిల్, మునగ వంటి పంటలు కూడా సాగుచేస్తున్నాడు. ఈ పంటల్లో డ్రాగన్, జామ తోటలు రెండేళ్లుగా కోతకు వచ్చి ఆదాయాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది మునగ పూతదశకు వచ్చింది. ఇవన్నీ ఒకటికాదు రెండు కాదు ఏకంగా తొమ్మిది ఎకరాల మెట్టు భూముల్లో బిందుసేద్యం ద్వారా సాగుచేపట్టాడు.

నిరీక్షణకు ప్రతిఫలం

డ్రాగన్ తోటలను తొలుత సాగుచేస్తున్న సమయంలో పలువురు రైతులు రమేష్‌బాబును తప్పుబట్టారు. ఈ పంట ఇక్కడ పండదని కొట్టిపారేశారు. గతేడాది కాలంగా ఏడాదికి రెండు పర్యాయాలు పూతకు వచ్చే ఈ డ్రాగన్‌తో 15 టన్నుల డ్రాగన్ దిగుబడి రావడంతో రూ. 2 లక్షల మేర ఆదాయం పొందిన రమేష్ బాబు తరువాత జామ, మునగ పంటలతో కూడా ఏడాదికి మరో రూ.1.50 లక్షల మేర వ్యాపారం చేశాడు. ఇవే కాకుండా డ్రాగన్, జామ నర్సరీలు ప్రారంభించి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. డ్రాగన్, జామ పంటను సూపర్ మార్కెట్‌కు విక్రయించి సకాలంలో ఫలితాలు పొందుతున్నాడు. రెండేళ్ల నిరీక్షణ అనంతరం పంటలు చేతికంది వస్తుండడంతో రమేష్‌బాబు అందరికీ ఆదర్శంగా మారాడు. ఆయన మాదిరి చాలా మంది ఈ మండల రైతులు చిన్నచిన్న పొలాల్లో డ్రాగన్ తోటలు వేస్తున్నారు.

సొంతంగా నర్సరీ ఏర్పాటు

రమేష్‌బాబు సాగుచేస్తున్న పొలాల్లో మూడు ఎకరాల్లో డ్రాగన్ మొక్కలు 3500లు వరకూ ఉన్నాయి. పక్కనే ఉన్న మరో మూడు ఎకరాల్లో 3 వేల తైవాన్ జామమొక్కలు పెంచుతున్నాడు. రెండెకరాల్లో మునగతోట, మరో ఎకరా విస్తీర్ణంలో నేరేడు, గ్రీన్ యాపిల్ మొక్కలు సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం ఒక్కో పంట పూతకు వచ్చి విక్రయాలు జరుగుతుండగా, ఈ పంటలన్నీ సేంద్రియ ఎరువుల ద్వారానే పండిస్తున్నారు. చాలా మంది రైతులు ఈయన వద్ద మొక్కలు కొనుగోలుకు వస్తుండడంతో సొంతంగా నర్సరీ ప్రారంభించి డ్రాగన్, జామ, మునగ మొక్కలను కూడా విక్రయిస్తూ సులభపద్ధతిలో లాభాలు ఆర్జిస్తున్నాడు.



నర్సరీలో మొక్కల తయారీ

సాగు బాగుంది



వాణిజ్య పంటల సాగు ప్రస్తుతం బాగుంది. డ్రాగన్‌కు మంచి డిమాండ్ ఉంది. పంట పూతకు రాకముందే సూపర్ మార్కెట్ వ్యాపారులు నా దగ్గరికి వచ్చి అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. జామ కూడా పూతదశకు వచ్చింది. మునగ నేరుగా కూరగాయల వ్యాపారులకు చేరుకుంటుంది. మల్టీ క్రాప్‌పై దృష్టిసారించాను. మెట్టుభూములుగా ఉన్న పంటపొలాల్లో డ్రాగన్, జామ, మునగ, యాపిల్ తోటలు వేశాను. ఫలితాలు బాగున్నాయి.

– దూబ రమేష్‌బాబు, కాగితాపల్లి

నియోజకవర్గంలో నవ కేంద్రాలు

- పుర్రేయవలసలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్
- రూ.2.93 కోట్లతో ఏర్పాటు
- మంజూరైన పరిపాలన అనుమతులు
- ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



విద్యుత్ సబ్ స్టేషన్

చీపురుపల్లి: ప్రజలకు మేలు చేయాలనే తలంపు పాలకులకు ఉంటే ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా సాకారం అవుతాయి. అందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నుంచి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ వరకు నిరంతరం ప్రజలకు మంచి చేయాలనే తపనతో ఉంటారు. ఇందుకు చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రజలకు అందుతున్న విద్యుత్ సేవలే చక్కని ఉదాహరణగా నిలుస్తాయి. నియోజకవర్గంలోని ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలని, అంతరాయం లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(ఆర్‌ఈసీఎస్) పరిధిలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో 2004 నుంచి 2014, 2109 నుంచి ఇంతవరకు ఎనిమిది విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటయ్యాయి. చీపురుపల్లి మండలంలోని చీపురుపల్లి, గత్సలవలస, పికె.పాలవలస, గరివిడి మండలంలోని గరివిడి, కోనూరు, మెరకముడిదాం మండలంలోని గర్భాం, సోమలింగాపురం, గరుగుబిల్లి గ్రామాల్లో విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ల చొరవతో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పుర్రేయవలసలో తొమ్మిదో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి నిధుల మంజూరు, పరిపాలన అనుమతులు తెప్పించారు. ఈ విద్యుత్ కేంద్రం అందుబాటులోకి వస్తే ఇంతవరకు ఉన్న విద్యుత్ ఉపకేంద్రాలపై మరింత లోడ్ భారం తగ్గి అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు అవకాశం ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. చీపురుపల్లి మండలంలోని పుర్రేయవలస గ్రామంలో 5ఎంవీఏ (మెగా వాట్ ఏంప్) సామర్థ్యం గల విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు పుర్రేయవలసలో 5 ఎంవీఏ సామర్థ్యం గల విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి రూ.2,93,44,089 కోట్ల నిధుల విడుదలకు పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. పుర్రేయవలసలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం అంశం కొంతకాలంగా ప్రతిపాదనల్లో ఉన్నప్పటికీ తాజాగా నిధుల మంజూరు అమతులు రావడంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే అధికారులు స్థల పరిశీలన కూడా పూర్తి చేశారు.

సెంచూరియన్‌లో ముగిసిన క్రీడాపోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సెంచూరియన్ యూనివర్సిటీలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ యోగా, కత్తి యుద్ధం తదితర పోటీలకు పర్లాకిమిడి, రాయగడ, ఒడిశా, ఛత్రపూర్, బలంగీర్, గోపాల్‌పూర్, విజయనగరం క్యాంపస్‌ల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల ఏకాగ్రత పెరిగి చదువులో రాణిస్తారని చెప్పారు. ఈ పోటీల్లో అత్యధికంగా బంగారు పతకాలు సాధించిన మణివరన్ (విజయనగరం క్యాంపస్)కు రూ.5వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటలు దగ్ధం



దగ్ధమైన జీడితోటలు

సీతంపేట: మండలంలోని నాయకమ్మ గూడ పంచాయతీ పరిధి గడిగుజ్జి, మర్రిమానుగూడ గిరిజన గ్రామాల పరిధిలో సోమవారం జీడిమామిడి తోటలు దగ్ధమవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆందోళన చెందిన గిరిజనులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సుమారు 10 ఎకరాల్లో తోటలు అగ్నికి ఆహుతయ్యాయని గ్రామస్తులు వాపోతున్నారు. తమను ఐటీడీఏ ఆదుకోవాలని కోరుతున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150–00
బంగారం(22కి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

లారీ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన పవన్ (ఫైల్)

కొమరాడ: మండలంలోని శివిని గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి లారీ ఢీకొనడంతో శివిని గ్రామనికి చెందిన యువకుడు అరసాడ పవన్ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై జగీదీష్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఆటో డ్రైవ్ చేస్తూ పార్వతీపురం వైపు వెళ్తున్న పవన్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అయినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

చెట్టుపై నుంచి జారిపడి వృద్ధుడు..

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన ఎచ్చెర్ల వీరయ్య(65) చెట్టుమీద నుంచి జారి పడి మృతిచెందినట్లు ఎస్సై ఆర్.జనార్దనరావు సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామ సమీపంలోని తోట లో టేకు చెట్టు ఎక్కి కొమ్మ లు తెంచుతుండగా జారి పడిపోయి మృతి చెందినట్లు మృతుడి భార్య శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు. వీరయ్య రాజాంలోని శ్రీనివాసా రోడ్డులో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడని, సోమవారం మార్కెట్ సెలవుకారణంగా చెట్టుకొమ్మలు నరికేందుకు వెళ్లి ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించామన్నారు.



వీరయ్య మృతదేహం

చికిత్స పొందుతూ యువకుడు..

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి–గ్రహపతి అగ్రహారం గ్రామాల మధ్య రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోగా తీవ్ర గాయాల పాలై చికిత్స ఆస్పత్రిలో పొందుతున్న యువకుడు మృతి చెందాడు. విశాఖ జిల్లా, అనంతగిరి మండలం, బొడ్డవర గ్రామానికి చెందిన పులి అయుష్(15) ద్విచక్ర వాహనంపై ఈనెల 9న దేవుపల్లి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఆస్కార్ అవార్డుతో దేశ ప్రతిష్ట పెరిగింది

- మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో దేశ ప్రతిష్ట పెరిగిందని మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి స్థానిక కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలకు సోమవారం వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తెలుగుదనం ఉట్టిపడేలా పాటను రూపొందించిన సినిమా దర్శక, నిర్మాత, పాట రచయిత, నటులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఫిజియోథెరపీతో ఉపశమనం

- సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో సేవలు
- అధిక సంఖ్యలో వస్తున్న రోగులు
- నెలలో 1500 మందికి వైద్యుల సేవలు



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఫిజియోథెరపీ విభాగం



నడుంనొప్పి రోగికి ఫిజియోథెరపీ



మెడనొప్పి రోగికి సేవలు

విజయనగరం ఫోర్ట్: వయసుతో సంబంధం లేకుండా ప్రస్తుతం చాలా మంది నడుము, కీళ్ల, మెడ నొప్పి, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇటువంటి రోగులకు ఫిజియోథెరపీ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ సమస్యలు ఉన్నవారంతా ఫిజియోథెరపీ చేయించుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల ఫిజియోథెరపీ విభాగంలో అన్ని రకాల నొప్పులకు సేవలు అందుబాటులో ఉన్నాయి.

ఈ రోగులకే ఫిజియోథెరపీ సేవలు

ఆస్పత్రికి వచ్చే ఓపీతో పాటు ఇన్‌పేషెంట్ రోగులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. శస్త్రచికిత్స అయిన రోగులు త్వరగా కోలుకోవడానికి ఫిజియోథెరపీ దోహదపడుతుంది. పేద, మధ్య తరగతి రోగులు, నడవలేని, కదల్లేని స్థితిలో ఉన్నవారు, దీర్ఘకాలిక ఎముకల సంబంధిత వ్యాధిగ్రస్తులు, న్యూరో సంబంధిత బాధితులు ఫిజియోథెరపీ చేయించుకుంటూ తక్షణమే ఉపశమనం పొందుతున్నారు.

అధిక సంఖ్యలో వస్తున్న రోగులు

సర్వజన ఆస్పత్రిలో ఫిజియో థెరపీ వైద్య సేవలు ఉచితం కావడంతో నిత్యం అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మంది వరకు ఓపీ రాగా 10 నుంచి 20 మంది రోగులు ఇన్‌పేషెంట్‌గా సేవలు పొందుతున్నారు. నెలకు 1500 మంది వరకు ఈ సేవలు పొందుతున్నారు. ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనిల్, డాక్టర్ స్వాతి, డాక్టర్ దీపక్‌లు రోగులకు సేవలు అందిస్తున్నారు.

సేవలతో సంతృప్తి



ఫిజియోథెరపీ కోసం నిత్యం రోగులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నారు. సేవలు పొందిన వారంతా సంతృప్తితో వెళ్తున్నారు.

– డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

కూర్చోలేకపోయివాడ్ని



అడుగు తీసి అడుగు వేయలేక పోయేవాడ్ని, కూర్చోవడానికి చాలా ఇబ్బందిగా ఉండేది. 15 రోజులుగా సర్వజన ఆస్పత్రికి వచ్చి ఫిజియోథెరపీ చేయించుకుంటున్నాను. ఇప్పుడు కొద్ది కొద్దిగా నడవగలుగుతున్నాను. కూర్చోగలుగుతున్నాను.

– లెంక వెంకయ్య, నందాం, గంట్యాడ మండలం

సకాలంలో చేయించుకుంటే మంచిది



దీర్ఘకాలిక ఎముకల సంబంధిత వ్యాధులు ఉన్న వారు సకాలంలో ఫిజియోథెరపీ చేయించుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

– డాక్టర్ అనిల్, ఫిజియోథెరపిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి